"హమ్మో!" అంటూ ఒక్క కేక వేసింది కిశోరి. హడలిపోయి "ఏం జరిగింది?" అంటూ ఆమె చుట్టూ బిగిసికొని వున్న తన చేతుల్ని తీసేశాడు కిరణ్.

ఆమె ఏడుస్తోంది. ముక్కు నుంచి రక్తం బొట బొటా కారుతోంది.

"హమ్మో ఏమైంది?" గుండెలు దడదడా కొట్టుకున్నాయి కిరణ్‌కి.

'ఏంతపనిచేశాడు! ఒళ్ళు తెలియని తమకంలో, ఆమె ముక్కు కొరికేశాడు.

ఇప్పుడేం చెయ్యాలి? ఎలాగ?'

కిరణ్‌కి చేతులూ, కాళ్ళూ ఆడ్డం లేదు.

"ఆటో! ఆటో!" అంటూ అరిచి, కిశోరిని ఆటోలో తీసుకుని దగ్గర్లో వున్న ఒక హాస్పటల్ దగ్గర దింపి, చేతుల్లో లోపలికి తీసుకుని వెళుతూ, "డాక్టర్! డాక్టర్! ప్లీజు...ప్రమాదం అయిపోయింది. అర్జంటు... ఈ అమ్మాయి ముక్కు! కుట్లు వెయ్యాలేమో చూడండి...అర్జంటు డాక్టర్...ప్లీజ్" అంటూ కాళ్ళా వేళ్ళా పడ్డాడు.

డాక్టరమ్మ నవ్వుతూ "ముక్కు ఏవిటయ్యా! ఎవరు నువ్వు? ఏమైంది?" అంటూ కిశోరిని పడుకోబెట్టిన టేబిల్ దగ్గరికి వచ్చింది.

వస్తూనే కిశోరిని చూసి కొయ్యబారిపోయి, కెవ్వున అరచి, వెంటనే అపర చండికలా గుడ్లురుముతూ, "ఎవరు నువ్వు? ఎవరిలా చేశారు మా అమ్మాయిని? ఏం మాట్లాడవేం?" అంటూ అరవసాగింది డాక్టరమ్మ.

"కిశోరి మీ అమ్మాయాండీ...! సారీ...పొర బాటయిపోయింది. ముందు ఆమెకి డ్రెస్సింగ్ చెయ్యండి. తర్వాత మీ యిష్టమొచ్చిన శిక్ష వేద్దురు గాని...ప్లీజ్ నాకు కొంచెం మంచినీళ్ళివ్వండి" అంటూ కిరణ్ ఆమెకి చేతులు జోడించి నమస్కరించాడు.

కోర్టునుంచి సమన్లు వచ్చిన రోజున, కోర్టూ, జడ్జీ, వాదనలూ, విచారణలూ, శిక్షలూ, జైళ్ళూ, అన్నీ వరస వరసగా జ్ఞాపకం వచ్చేసి, కిరణ్‌కి గుండెల్లో రైళ్ళు పరిగెట్టాయి. జరగబోయేది తలుచుకుంటే భయం. జరిగింది జ్ఞాపకం వస్తే సిగ్గూ.

ఎంత పనిజరిగిపోయింది? గాఢంగా ముద్దు పెటుకుంటే సరిపోయేదానికి, ఎంత పనిచేశాడు తను? ప్చ్! ఏవిటో! చదివిన చదువూ తెలివీ ఏం ఉపయోగపడలేదు.' ఆలోచించిన కొద్దీ చిన్న బుచ్చుకుని చింతపోసాగాడు కిరణ్.

'కిశోరి హాస్పటల్‌కి రావడమే లేదు.

తను కూడా తప్పని సరిగా వస్తున్నాడు. కొందరు తనని చూసి ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. తెలిసిపోయిందేమో తను చేసిన ఘనకార్యం. మరికొంద రైతే తనని నిలబెట్టి మరీ చివాట్లు పెడుతున్నారు. "ఏవిటయ్యా నీ ప్రేమ పాడుగానూ! ఇంత వరకూ తెచ్చుకున్నావేమిటి?" అంటూ. వాళ్ళ మందలింపు మాటలకి తను తల వొంచుకుంటున్నాడు. అంతకంటె ఏం చెయ్యగలడు?'

కోర్టు బంట్రోతు "దేముని ఎదుట..." అంటూ ప్రమాణం చేయిస్తూంటే, యాంత్రికంగా ఆ మాటలు అంటున్నాడేకాని, కిరణ్‌కి కాళ్ళూ చేతులూ వణుకుతున్నాయి. వేగంగా కొట్టుకోవడంతో గుండె మధ్య మధ్య లయ తప్పుతోంది. జేబు రుమాలుతో ఎన్నిమాట్లు తుడుచుకున్నా మళ్ళీ మళ్ళీ ముఖం చెమటతో తడిసిపోతోంది. తల ఎత్తి చూడక పోయినా, చుట్టూ వున్న జనంలో సగంమంది ముసి ముసి నవ్వులు నవ్వుతూన్నట్టూ, తక్కిన సగం మందీ నోటికి చేతులు అడ్డం పెట్టుకుని మరీ నవ్వుతున్నట్లూ గ్రహించాడు కిరణ్. జడ్జీగారు కూడా మూతి తుడుచుకొనే వంకతో వచ్చే నవ్వుని జేబురుమాలు మాటున దాచుకుంటున్నారు.

కోర్టు హాల్లో జనం అంతా నవ్వుతూనే వున్నారు.

వాదిస్తూన్న కిశోరి తండ్రీ, ప్రేక్షకులలో కూర్చున్న తల్లి మాత్రం నిప్పులు కురిపిస్తూ కోపంగా చూస్తున్నారు.

అటు బోనులో కిశోరి-ఇటు బోనులో కిరణ్ ఇద్దరూ తలలు వంచుకొని నిలబడ్డారు.

కిశోరి తండ్రి కోర్టు సీలింగ్ ప్రతిధ్వనించేలా కోపంతో గట్టిగా వాదిస్తున్నాడు "కిశోరిని అమాయకురాలిని చేసి ప్రేమించడం ఒక నేరం, ఆమెని ఒంటరిగా బీచ్‌కి తీసుకు వెళ్ళడం ఒక నేరం. పిచ్చి ప్రేమతో ముక్కు కొరికెయ్యడం అన్నింటికంటే పెద్ద నేరం. ఈ నేరాల కన్నింటికీ ఇతనికి శిక్ష వెయ్యడంతో బాటు, బంగారం లాంటి అమ్మాయి ముఖం, ముక్కుకి వేసిన కుట్లతో అందం చెడిపోయింది కనుక, పెళ్ళి కావడం కష్టం. అందువల్ల ఈ నేరస్థుడి దగ్గర్నుంచి నష్ట పరిహారం కూడా ఇప్పించాలి..." అంటూన్న అతని మాటలు వింటూంటే పిడుగులు పడుతూన్నట్లున్నాయి.

కిరణ్‌కి అక్కడి నుంచి కాలికొద్దీ పరిగెట్టి పారిపోవాలనిపించింది. పారిపోలేక బిక్కమొహం పెట్టుకుని చూస్తూ వుండిపోయాడు.

డిఫెన్స్ లాయర్ మాటిమాటికీ అటు తిరిగి నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుని నవ్వుకుంటూ, "మిస్టర్ కిరణ్! ఎం.బి.బి.ఎస్. పాసయి హౌస్ సర్జన్ చేస్తూన్న యువకుడివీ...విద్యా వంతుడివీ...అసలు నువ్వీ నేరం చేశావని నేను అనుకోవడం లేదు. చేస్తే ఏదో ప్రత్యేక పరిస్థితిలో చేసి వుండాలి...ఆ వివరాలన్నీ చెప్పి నీ నిర్దోషిత్వం నిరూపించుకో!" అన్నాడు.

జడ్జీగారు కూడా వచ్చే నవ్వుని ఆపుకుంటూ సీరియస్‌గా "ఊ...ప్రొసీడ్" అనే సరికి, ఆయన అవస్థ చూసి, అప్పటిదాకా నవ్వుని అతి బలవంతంమీద ఆపుకున్న కోర్టులో వాళ్ళంతా గలగలమని నవ్వేశారు. దాంతో, ఎప్పుడూ కోపాలతోనూ వాదనలతోనూ నిండివుండే కోర్టు ఒక్కసారిగా కలకల్లాడిపోయింది.

తలలెత్తి కిశోరీ కిరణ్ ఒకరికేసి ఒకరు చూసుకున్నారు. ఇద్దరి కళ్ళూ సిగ్గు దొంతరలతో బరువెక్కాయి. రెప్పలు వాల్చేసి క్రిందకి చూస్తూ వుండిపోయారు. కిశోరి తల్లి మాత్రం, కూతురి ముక్కునీ, ముక్కుమీద వేసిన ప్లాస్టర్‌నీ ఒ క మారు ఆప్యాయంగా నిమిరి కిరణ్‌కేసి కోపంగా చూసింది.

"నువ్వు చెప్పేది ఏవైనా వుంటే చెప్పు" అన్నారు జడ్జి.

కాలమ్ దొంగ కథ

ప్రణయ కలహం

ఆ ఆకారం నెమ్మదిగా లోపలికి ప్రవేశించింది. ఆ ఆకారం మగది. అతడు జేబులో నుండి తాళం తీసి తలుపు కీహోల్లో పెట్టాడు. క్లిక్‌మంది ఆ తలుపు. పర్మినెంట్ లాక్ తలుపు అది. లోపల తాళం వేయటాన్కి వీలుంది, బయట వేయటాన్కీ వీలుంది. అలానే తీయటాన్కి కూడా. అతడు నెమ్మదిగా నడచి ముందుగా వంట యింటి వయుపు నడిచాడు. లోపలికి నడచి గ్యాస్టవ్ ప్రక్కనే వున్న రెండు గిన్నెల మూత తెరిచి వాసన చూశాడు. అబ్బ! నోరూరింది. అది తనకు ఇష్టమయిన వంటకం. మరోసారి వాసన పీల్చి బయటకు నడిచాడు. మరో గదిలో వున్న బీరువా వయుపు కదిలాడు అతడు. జేబులో నుంచి మరో కీ తీసి బీరువా తెరచాడు. రెండో జేబులో నుండి ఏదో తీసి లోపల పెట్టాడు. ఆ తర్వాత నెమ్మదిగా బయటకి వచ్చి మధ్య హాలులో నిలబడి చుట్టూ చూసాడు. 'అమ్మయ్య' సంతృప్తిగా అనుకొన్నాడు. ఇంక లేపొచ్చు అని కూడా అనుకున్నాడు. అనుకుంటూనే మరో గది వయుపు నడిచాడు. ఆ గది ఆ ఇంటాయన భార్యది. మామూలుగానే లోపలికి నడిచి తలుపు వేసేశాడు. ఆ గదిలో ఒకే మంచం వుంది. అది డబుల్‌కాట్. ఆ మంచంపైన ఆమె పడుకుని వుంది. మంచి నిద్రలో వున్నదేమో పైట చెదిరిపోయి వుంది. చీర పైకి తొలగి వుంది. మొత్తానికి ఆ భంగిమ సెక్స్ భావం కలిగించేది. ఆమెది అసాధారణమైన అందం. రెచ్చకొట్టే అందం. ఇక ఆగ లేకపోయాడు అతడు. నిగ్రహశక్తి కూడా కోల్పోయాడు. అప్పటిదాకా లేపుదామనుకొంటున్న అతడు గభాలున మీదపడ్డాడు. పడటంతోనే బలంగా ఆక్రమించుకొన్నాడు. ఆమె కెవ్వున అరవబోయింది. ప్రయోజనం లేకపోయింది. ఈ లోపునే... జరగవలసింది జరిగిపోయింది.

* * *

"సారీ సుజీ! రాత్రి చాలా లేటయింది. అనుకుంటూనే వున్నాను. అయినా జరగనే జరిగింది. నాకు ఇష్టమయిన వంటకాలే చేశావ్! అయినా ఏం ప్రయోజనం-అవి పాడైపోయాయి. ఇంకా నేను భయపడ్డాను నీకెక్కడ కోపం వస్తుందో, ఎక్కడ ఏ సామాను విరగ్గొడ్తావోనని. ఆ ఖర్చు తప్పించావ్- మరీ అంత కోపంగా చూడకు. నాకిష్టమయినవే ఈ రోజూ చెయ్యి. ఈ రోజు లేటుగా రాన్లే. అన్నట్లు రాత్రి బీరువాలో ఈ నెల జీతం పెట్టాను. అవి తీసి ఎవరికి ఎంతివ్వాలో ఇచ్చేయ్. అన్నట్లు ఇదిగో డూప్లికేట్ తాళాలు. తీసుకో. ఇప్పటికైనా నమ్మకం కలిగిందా! ఇంకా అలా కోపంగా చూడకు!" అంటున్న భర్త మాటలకి ఫక్కున నవ్వింది సుజాత. సుబ్బారావు స్కూటరు తీయటాన్కి వెళ్ళాడు. అతని వయుపు సంతృప్తిగా చూసింది డూప్లికేట్ సత్యభామ అయిన సుజాత.

– మన్నవ సుధాకర్